# తలలో తేలు

గోపీచంద్ ప్రయివేటు కంపెనీలో చేరాడు.

ప్రభుత్వ సంస్థలో కాని – ప్రభుత్వరంగంలో కాని ఉద్యోగం దొరకనందుకు విచారించినా, కాస్త కడుపునింపు కోవడానికి ఆధారం దొరికిందని సంతోషించాడు.

షిఫ్టు డ్యూటీలుండేవి. ఒక్కోసారి రాత్రి డ్యూటీ కూడా పడుతుండేది. తను చదువుకున్న చదువుకు – చేస్తున్న పనికి ఎంతమాత్రం పొంతనలేదు. ఆ మాట కొస్తే చాలామంది చేసే ఉద్యోగాలకు ఏడవ క్లాసు చాలనిపిస్తుంది. కాస్త అక్షరాలను అంకెలను గుర్తు పట్టగలిగి ఉండాలి. ఆపైన కాళ్లు చేతులు ఆడించగలిగితే అన్ని పనులు అయిపోతాయి.

దేవుడు ఒక అనవసరమైన పదార్థాన్ని తయారు చేశాడు. అందరికి అదొక బరువుగా తయారవుతున్నది. దాన్ని కొందరు 'మెదడు' అంటారు. దాని ఉపయోగం ఏమిటో ఈ ప్రపంచంలో తొంభైతొమ్మిది శాతం మందికి తెలియదు. మనది ప్రజాస్వామ్యం కాబట్టి అత్యధికుల అభిప్రాయం ప్రకారం దాన్ని తొలగించి – ఆ ఖాళీ స్థలంలో దేవుడు యింకేమయినా నింపితే బాగుండును.

తన కాలేజీ చదువులకు – లెక్చరర్లు చెప్పిన పాఠాలకు అస్సలు బ్యాలెన్సు కుదరక – చాలా అవస్తపడుతున్నాడు గోపి. 'సత్యం వద – ధర్మం చెఱ' అని నేర్చుకున్నాడు కాని – దాని అర్థం "సత్యం వధించబడింది – ధర్మం చెరసాలలో బంధించబడింది" అని అతనికి యిప్పుడు తెల్సివచ్చింది.

ఉద్యోగ ధర్మంలో అబద్ధాలు చెప్పక తప్పడం లేదు. అవకతవక పన్లు చెయ్యక తప్పడం లేదు. ఆత్మవంచన చేసుకోవడం తప్పనిసరి.

జీవితం అంటే (జి.కె) జనరల్ నాలెడ్జితో అవతలి వ్యక్తి యొక్క వీక్‌నెస్ పైన తన్నడం అని తెల్సివస్తున్నది.

ఇలా ఉండగా ఓ వారం రోజులు ట్రైనింగుకు పిలుపు వచ్చింది. ట్రైనింగు హెడ్డాఫీసులో కాదు. సిటీకి దూరంగా అటు పల్లెటూరు – ఇటు పట్టణం కాని ప్రశాంత

వాతావరణంలో నట!

ఏదైతేనేం కాస్త రొటీన్‌కు భిన్నంగా ఉంటుందని సంతసించాడు. మూట ముల్లె కట్టుకొని బయలుదేరాడు గోపి.

దాదాపు ఓ అరవై మంది దాకా ఉన్నారు ట్రైనింగులో. ఓ పెద్ద హాలు - దానిలో కుర్చీలు - బల్లలు రాసుకోవడానికి పెన్నులు - నోటు బుక్కులు యిచ్చారు.

గంట గంటకి తలకాయలు మారుతూ ఉంటాయి. ఒక్కోడు ఒక్కో వెర్రి మొహం పెట్టుకొని నోటికి వచ్చినట్లు వాగేసి పోతుంటాడు. వీళ్ళంతా షేక్సుపియరు మొహాలేసుకుని చూస్తుంటారు!

అన్నిటి కంటె గోపీకి నచ్చిన విషయం ఏమంటే .... గంటన్నర కాగానే బ్రేక్ వస్తుంది - బిస్కట్లు, కాఫీ, టీలు సప్లై చేస్తారు. తాగిన వాడికి తాగినంత - తిన్నవాడికి తిన్నంత.

ఆపైన లంచ్‌లో బాగా మంచి భోజనం - విందు భోజనం - స్వీట్లు - హాట్లు - ఆయిలీపుడ్డు - ఇంట్లో చేసుకునేదాని కంటే నాలుగైదు ఐటమ్స్ ఎక్కువే ! సాలాడ్లు - అప్పడాలు - చిప్పులు - ఐసుక్రీములు వగైరాలున్నాయి.

ఫ్రీగా వస్తే ఫినాయిలు తాగే అలవాటు చాలామందికి ఉంది అక్కడకి వచ్చిన వాళ్లల్లో.

అందుకే ఒక్కోళ్లు - యిద్దరు ముగ్గురి భోజనం లాగించేస్తున్నారు - అలవోగ్గా.

అంతకుత్తుకనిండా తిన్నతర్వాత మధ్యాహ్నం పాఠాలు ఏం తలకెక్కుతాయి? అర్ధనిమీలిత నేత్రాలతో ఊకొడ్తూ వింటూ ఉంటారు. వీళ్లని చూసి చెప్పే పెద్దాయనకు కూడా నిద్ర మత్తు వచ్చి కొన్ని తప్పులు కూడా చెబుతుంటాడు. కాని కనిపెట్టే వాళ్లెవరు? ఈలోగా మళ్లీ టీలు - కాఫీలు - లైట్ రిఫ్రెష్ మెంట్లు కడుపులు ఖాళీ లేక పోయినా - బస్సు కండక్టరును తల్చుకుని, పొట్టలో ఖాళీ కల్పించుకొని - మళ్లీ డస్ట్ బిన్‌లో వేసెయ్యడమే !

కాస్త నిద్ర మత్తు వదిలిందో లేదో .... ఆరు దాటుతుంది.

ఏడు కల్లా మీల్సు రడీ !

నైట్ చపాతీలు – నార్త్ యిండియన్ ఐటమ్స్ – సౌత్ యిండియన్ పుడ్డుతో పాటు.

ఎప్పుడూ తినే సౌత్ యిండియన్ పుడ్డుకు కోపం వస్తుందని, దాన్ని తిని – అనుకోని గెస్టు అయిన నార్త్ యిండియన్ రోటి, కర్రీలను ఆదరించాలి కాబట్టి ... వాటిని కూడా నోట్లో కుక్కేసు కుంటారు చాలామంది.

అటువంటి వారిలో గోపీ ఒకడు.

తిండి తినడంలో సిగ్గు పడకూడదని అతని వాదన. తినేప్పుడు ఈ భూప్రపంచంలో రేపు తిండి దొరకదు అన్నంత ఆబగా లాగించాలని అతని సిద్ధాంతం!

ఎటొచ్చి యింత తృప్తిగా పుడ్డు తిన్న తర్వాత కొంచెం అసంతృప్తి కలిగించేది బెడ్డు మాత్రమే ! అదేం ఖర్మో – దుడ్డులకు ఏమడ్డమొచ్చిందో – డార్మిటరీ టైపులో వసతి కల్పించారు. ఓ పెద్ద హాల్లో – ఓ యిరవై ముప్పై మంచాలు వేశారు.

హాలు కూడా అంత బాగా లేదు పెచ్చులూడిపోతున్న రూపు – మాసిన గోడలు – సున్నం అక్కడక్కడ రాలుతున్నది – పైన సీలింగ్ ఫ్యాన్లు తిరిగే టప్పుడు కిందకూడిపడతాయేమో నన్నంతగా శబ్దాలు చేస్తున్నాయి. లైటింగు కూడా అంతంత మాత్రమే !

కొబ్బరి పీచుతో చేసిన పరుపులు – గలీబులు ఊడిపోయి చినిగి పోయి అక్కడ అక్కడ పీచు బయటకొస్తున్నది. హాలు బయట తోట – చెట్లు – చల్లటి గాలి! కాకపోతే అసలే చలికాలం – వాతావరణం తేమగా ఉంటున్నది... తరచు చిరుజల్లులు కురుస్తూ ఉంటాయి.

బాతురూములు – లెట్రిన్లు గొప్పగా లేవు.

అంతకు ముందు రాత్రి చేసిన ప్రయాణం అలసట – తిన్నతిండి – పొట్ట బరువు – కళ్లు మూతలు పడుతున్నాయి తొమ్మిది కూడా కాకుండా ఏం పడుకుంటామని గోపి కబుర్లు చెబుతున్నాడు.

ఈలోగా కో ఆర్డినేటరు అప్పారావు వచ్చాడు. "ఫ్రండ్సు.... నేను మీ బ్యాచ్‌కోఆర్డినేటరని మీకు తెల్సు, అప్పారావు నాపేరు - మా అరేంజి మెంట్లు ఎలా ఉన్నాయి?" అడిగాడు అందరిని ఉద్దేశించి.

మొహమాటంతో అందరూ మౌనంగా తలూపుతున్నారు. గోపీ అందుకున్నాడు "ఎక్సలెంట్ సార్ - మీ ఆతిథ్యం చాలా బాగుంది ఉదయం టిఫిన్లు - భోజనాలు - కాఫీలు అన్నీ బాగున్నాయి - ఈ మారుమూల ఊళ్లో యింత మంచి ఆంధ్రభోజనం తయారు చేయడం మా అదృష్టం - మీ కృషి."

"థ్యాంక్యూ ! పాఠాలు బాగున్నాయా ?"

" అవ్వే ! కొంచెం - " చెప్పాడు గోపీ !

"అర్థం కాలేదా !?" అప్పారావు అడిగాడు.

"కొంచెం - అర్థమయింది." సంకోచించాడు గోపి.

"అంటే సగం కూడా అర్థం కాలేదా !?" ఆశ్చర్యపోయాడు.

"అబ్బే ! పుడ్డు బాగుంది .... పాఠాల దేముంది సార్ - మీరు ఎలాగూ నోట్సు యిస్తారుగా - యింటికి పోయి చదువుకుంటాం. !"

" నో ! నో ! ట్రైనింగు అయిపోయింతర్వాత ఎగ్జామ్ పెడతాం దానిలో పాసైతేనే మీ ఉద్యోగం ఖాయమయ్యేది - లేక పోతే మళ్లీ ట్రైనింగుకు రావాలి !" బెదిరించాడు అప్పారావు.

'చచ్చాంరా భగవంతుడా ! ఇదెక్కడి క్లాజు' అనుకున్నాడు గోపి. పైకి మటుకు "పడకలు యింకొంచెం బాగా అరేంజి చేస్తే బాగుండేది". అని అడిగాడు.

"ఏంఫర్వాలేదు మీరు హ్యాపీగా నిద్ర పొండి - కాని నిద్రపోయే ముందు చిన్న మాట - నిద్రలో మీరు జాగ్రత్తగా ఉండండి". చెప్పాడు అప్పారావు - అందరిని గమనిస్తూ.

ఈయనకేమన్నా మెంటల్ లేచిందా ఏమి - నిద్రలో జాగ్రత్తగా ఉండమంటున్నాడు. అని అనుకున్నాడు గోపి. అయినా - "ఎందుకుసార్ - నిందు

సంతోషంగా నిద్రపోవాలి కాని జాగ్రత్తగా ఎందుకుండాలి – దొంగల భయం ఉందా” అని అడిగాడు.

“ అబ్బే ! దొంగలైతే మనల్నేం చేయలేరు – వాచ్‌మ్యాన్ ఉన్నాడు.... కాని ఈ ఊరు తేళ్లకు ఫేమస్ ! నల్లతేలు కుట్టిందో ఆ మంటకు చస్తాం ! ఒక్కోప్పుడు ఆసుపత్రిలో చేరాల్సి వస్తుంది. ఆతేళ్లు అప్పుడప్పుడు కప్పు మీంచి కిందకు పడుతుంటాయి – తోటలోంచి షికార్‌గా మీహాల్లోకి వస్తాయి – కొంచెం అప్రమత్తంగా ఉండాలి.” చెప్పి వెళ్లి పోయాడు.

గోపీకి వెన్నులోంచి చలి మొదలైంది. వచ్చిన నిద్ర కాస్త ఎటో ఎగిరిపోయింది. అతనికి బొద్దింకలంటేనే భయం – చీమలన్నా – నల్లులన్నా తెగ ఎలర్జీ ! జర్రీపోతులన్నా వర్రీ అవుతుంటాడు. అటువంటిది తేళ్లున్నాయి అని చెప్పగానే గుండె దడ దడ కొట్టుకుంది.

గోపీ చెమటలు పడుతుంటే తోటి ట్రైనీలవంక చూశాడు. అందరూ మంచాలమీంచి చేచి కూర్చున్నారు. ఆఖరికి కాళ్లు కింద పెట్టడానికి కూడా భయపడుతున్నారు. లైట్లు ఆర్పేసి నిద్రపోదామనుకున్న వాళ్లు – అన్ని లైట్లు వేసుకొని పిచ్చా పాటీ మొదలెట్టారు

అసలే అలసట –

ఆపైన మృష్టాన్న భోజనం –

ఇంకా ఆపైన చల్లటి గాలి .....

బయట వర్షం – వంట్లో కంపరం .....

కళ్లు మూతలు పడుతున్నాయి – కాని పక్కనున్న కొలీగులు లేపుతున్నారు.

ఎవరికి కాస్త కునుకు పట్టినా మెలకువగ ఉన్నవాళ్లు వెంటనే లేపేస్తున్నారు. తమకు ఎలాగూ నిద్రలేదుగా – వాడెందుకు నిద్ర పోవాలని జెలసీ ఏమో !

ఎలాగైతే నేం తెల్లవారింది.

నిద్ర మొహాలతో ట్రైనింగు క్లాసులకు వెళ్లారు.

అక్కడ మళ్లీ కాఫీలు - టీలు - బిస్కట్లు - ఫలహారాలు - హెవీ లంచ్ ....
ప్రాణం ఎటోపోతున్నది.... చెప్పే పాఠాలు ఈ చెవిలో పడి - ఖాళీ ప్రదేశంలో నుండి బయట కొచ్చి, ఆచెవిలో నుండి ఊర్లోకి పారిపోతున్నాయి.

తిరిగి రాత్రయింది.

నిండు కడుపు - మళ్లీ మొదలు - నిద్రతూగు - కానీ కోఆర్డినేటరు గారి హెచ్చరిక గుర్తుకొచ్చింది.....

గోపి నిద్రను బలవంతాన ఆపుకొని వాళ్లిచ్చిన నోట్సు చదువుకొంటున్నాడు.

పక్కవాడు నిద్ర పోతే లేపి కూర్చొ పెట్టాడు.

అందరూ చేరి పాఠాలు - వాళ్ల డ్యూటీలో పడ్డకష్టాలు చెప్పుకున్నారు. చాలా అప్రమత్తంగా ఉండసాగారు.

కునుకు పాట్లతో రెండోరోజు కూడా దొర్లిపోయింది.

మూడవరోజు క్లాసులో పాఠాలు వినడం చాలా కష్టమై పోతున్నది. తిండి కంట్రోలు చేద్దామంటే ఉద్దరగా వచ్చేది..... తిన్నా తినక పోయినా చేసి పారేస్తున్నారు. సంస్థడబ్బులు చెల్లిస్తూ ఉంటుంది. ఎలాగూ వేస్టు అవుతుంది కదాని - ఆ చెత్తంతా పొట్టల్లో వేసేసుకుంటున్నారు.

రాజు మూడవరోజు వచ్చి జాయినయ్యాడు. వాళ్ల తాతకు సీరియస్‌గా ఉంటే రెండు రోజులు రాలేక పోయాడట.

ప్రిన్సిపాలు కోప్పడి - యాజ్ ఎ స్పెషల్ కేసుగా - ప్రత్యేక పరిస్థితులు పరిగణనలోకి తీసుకొని ఆయన్ని రానిచ్చాడు. మానవతా దృక్పథం లేక పోతే అతగాడి ప్రొబేషన్ పీరియడ్‌పెరుగుతుంది. జూనియరు అయిపోతాడు - ప్రమోషన్లలో దెబ్బతగులుతుంది.

ఆ రాత్రికి రాజు గోపీ హాలుకే కేటాయించ బడ్డాడు ఖాళీగా వున్న మంచం భర్తీ అయింది. వాడి ఊరు విశేషాలు కనుక్కుందాం అని గోపీ అనుకుంటుండగా - పక్కమంచంమీద రాజు గుర్రు పెట్టి నిద్రపోయాడు.

ఆ గుర్రు వింటుంటే అందరికీ గుర్రుగా వుంది. మూడు రోజులుగా తాము ఒక్కగంటకూడా నిద్ర పోలేక పోయారు – వీడు కొత్తగా వచ్చిన వెంటనే నిద్ర పోతున్నాడు – వీడి సంగతి తేల్చుకోవాలని అందరూ అనుకున్నారు.

గోపీ ముందుగా రాజును తట్టిలేపాడు – 'ఊహూ' లేవలేదు. అటూఇటూ తట్టి లేపి అలసిపోయాడు. మిగతా వాళ్లు కూడా వచ్చి అతన్ని అటుయిటు కదిపారు. రాజు మటుకు 'ఆ – ఊ' అని నిద్రపోయాడు. వాడి చావు వాడు ఛస్తాడులే అని విసుక్కున్నారు.

మిత్రులంతా గోలగా మాట్లాడినా కాని – కొట్టినా కాని రాజు మాత్రం కుంభకర్ణుడి తమ్ముడిలా నిద్రపోతున్నాడు.

"వీడి దుంపతెగ ! వీడికి యింత నిద్ర ఎలా వచ్చింది చెప్మా?" గోపీ స్వగతంగా అడిగాడు.

"వెధవని తేలుకుడితే గాని బుద్ధిరాదు... మనమంతా వీడికి కాపలా కాయాలి – వీడు మటుకు గుర్రుపెట్టి నిద్రపోవాలా?" సుబ్బారావు నొచ్చుకున్నాడు.

కొంతమంది రాజును చూసి నిద్రపోదామని ప్రయత్నించారు కాని – తేలు కుడుతుందేమోనన్న భయంతో ఆ నిద్ర ఎటో వెళ్లి పోయింది.

ఈలోగా తెల్లవారింది. గోపీ తన ప్రయత్నంలో విజయం సాధించాడు. సదరు రాజునిద్ర లేచి కిందకు దిగాడు.

"రాజూ ! ఎంత ప్రమాదం జరిగేదో తెల్సా ! నీ అదృష్టం – నిన్ను తేలు కుట్టలేదు.." చెప్పాడు గోపీ !

" తేలా ! ఎక్కడ !" అంటూ రాజు తాపీగా దుప్పటి మడత పెట్టాడు – దిండు పక్కకు వేశాడో లేదో – దిండు కిందున్న తేలు అమాంతంగా గోపీ మీద పడింది.

గోపీ గావు కేక పెట్టి పక్కకు జంప్ చేశాడు.

సుబ్బారావు వచ్చి చెప్పుతీసికొని తేలును చంపేశాడు.

అప్పుడు అందరూ రాజుకు అప్పారావు హెచ్చరికలు చెప్పారు. అతను ఎంత తెలివి తక్కువ పని చేసింది - తాము ఎంత తెలివి కల పని చేసింది - వివరించి చెప్పారు రాజు తలూపాడు.

గోపీ కోఆర్డినేటరు అప్పారావును కల్సి విషయం వివరించాడు. అప్పారావు దీర్ఘంగా నిట్టూర్చి ఇలా అన్నాడు "తేలు మీ అందరికి తలలో ఉంది - రాజుకు మటుకు బయట వుంది - అందుకే అతను బాగా నిద్ర పోయాడు. దటీజ్ ది పవర్ ఆఫ్ మైండు ! "మనసు చేతిలో మనిషి కీలు బొమ్మ !"

గోపీ తనతలలోంచి తేలును తీసి బయటకు విసిరేసి ఆ రోజు రాత్రి హాయిగా నిద్రపోయాడు.

( ఆంధ్రప్రదేశ్)